సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 1 । జూలై । 2025



లబ్ధిదారులకు ట్రబుల్!

అనాధికారికంగా డబుల్ బెడ్రూం ఇళ్లలోకి ప్రవేశించినవారిపై కేసులు నమోదు చేసినట్టు మంచాల సీఐ మధు తెలిపారు. 8లో▸



నేతాజీ పొదుపు సంఘానికి..

రుణాలు, వసూలులో ఆదర్శంగా నిలిచిన మన్సాన్‌పల్లి నేతాజీ పొదుపు సంఘానికి ఉత్తమ అవార్డు దక్కింది. 8లో▸



గంజాయి ముఠా గుట్టురట్టు

గంజాయి ముఠాను పోలీసులు రట్టు చేశారు. నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించారు. 8లో▸

న్యూస్‌రీల్

4, 5 తేదీల్లో కేవీపీఎస్ శిక్షణ తరగతులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తుర్కయంజాల్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ఈ నెల 4, 5 తేదీల్లో పురపాలక సంఘం పరిధి ఎస్ఎస్ఆర్ నగర్‌లో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడ సామేల్, మస్కు ప్రకాష్ తెలిపారు. రాగన్నగూడలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.శిక్షణ తరగతులకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె. ఆశీర్వాదం, యాదగిరి, జంగయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: అనుమతులు లేకుండా కొనసాగుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నారాయణ పాఠశాలవద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నారాయణ, శ్రీచైతన్యవంటి కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీస వసతులను కల్పించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్, నోట్‌బుక్స్, యూనిఫాం విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి రూ.వేలల్లో దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మారుస్తున్న విద్యా సంస్థల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిచౌహాన్, విజయ్‌కుమార్, గణేశ్, వంశీ పాల్గొన్నారు..

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

మొయినాబాద్: ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమనేత దేశమొళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కేంద్రంలో ఉద్యమకారులు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మర్చిపోయిందని విమర్శించారు. ఉద్యమకారులను మరవద్దనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు కుమ్మరి రమేష్, భిక్షపతి, మధు, అవినాష్, ముకుందరెడ్డి, బన్సీలాల్, రత్నం, కేబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మరకత శివాలయం సందర్శన



సినీ నటుడు బాలాజీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్పలో వెలసిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని సోమవారం సినీ నటుడు బాలాజీ దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మరకత శివాలయం ఎంతో అద్భుతంగా ఉందని, సమయం దొరికినప్పుడల్లా ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తుంటానని తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆల య చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌రాజు పాల్గొన్నారు.

చెత్త.. మురుగు

అస్తవ్యస్తంగా మున్సిపాలిటీలు



పహాడీషరీఫ్: షాహిన్‌నగర్-వెంకటాపూర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త



పహాడీషరీఫ్: రాజీవ్‌గాంధీనగర్‌లో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు

- లోపించిన పారిశుద్ధ్యం
- కంపుకొడుతున్న కాలనీలు
- రోగాల బారిన స్థానికులు

మున్సిపాలిటీలను పారిశుద్ధ్య సమస్య పట్టి పీడిస్తోంది. రోడ్లపక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోయి కాలనీలు కంపు కొడుతున్నాయి. నిత్యం వీధులను శుభ్రం చేయాల్సి ఉండగా సిబ్బంది కొరతతో వారం పది రోజులకోసారి ఊడుస్తున్నారు. ఇంటింటికీ జరగాల్సిన చెత్త సేకరణ సైతం సరిగా జరగడం లేదు. దీంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే పడేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్లపైనే, ఇళ్ల మధ్య నుంచే మురుగునీరు ప్రవహిస్తోంది. వర్షాకాలం కావడంతో ఈగలు, దోమలు వ్యాపించి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

పహాడీషరీఫ్: పెద్ద ఎత్తున మురికివాడలు కలిగిన జల్‌పల్లి మున్సిపాలిటీలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేదు. చాలా బస్తీల్లో పైప్‌లైన్లు లేకపోవడంతో ప్రజలు రింగ్‌లు వేసుకున్నారు. వ్యర్థజలాలు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో కొన్ని బస్తీల్లో ఇళ్ల మధ్య పారుతున్నాయి. స్థానికులను అనారోగ్యం పాల్జేస్తున్నాయి. లక్షకు పైగా జనాభా కలిగి 28 వార్డులతో కూడిన ఈ మున్సిపాలిటీలో ప్రైవేట్ ఆటోల ద్వారా రోజు విడిచి రోజు చెత్తను సేకరిస్తున్నారు. జల్‌పల్లి చెరువు పరిసరాల్లో కాటేదాన్‌కు సంబంధించిన కంపెనీల నిర్వాహకులు వ్యర్థాలను తీసుకొచ్చి రాత్రి పూట పడేసి పోతున్నారు. ప్రధాన నిత్యం శుభ్రం చేస్తున్నా అంతర్గత బస్తీల్లో మాత్రం మూడు నాలుగు రోజులకోసారి ఊడుస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది



శాంతినగర్ కాలనీలో దెబ్బతిన్న మురుగు కాలువ

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించింది. జనాభాకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారిని నిత్యం శుభ్రం చేస్తున్నా కాలనీల్లో మాత్రం వారం పది రోజులకు ఒకసారి అంతర్గత రోడ్లను శుభ్రం చేస్తున్నారు. కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో సరైన కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే నిలుస్తోంది. ఏళ్లక్రితం నిర్మించిన మురుగు కాలువలు దెబ్బతినడంతో నీరు సాఫీగా వెళ్లకుండా రోడ్లపైకి చేరుతోందని స్థానికులు తెలపారు. ఇంకా ఏడు కిలోమీటర్ల దూరం మురుగు కాలువలు నిర్మించాల్సిఉందని అధికారులు చెబుతున్నారు.

సేకరణ లేక.. రోడ్ల పక్కన చేరిక



చేవెళ్లలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో రోడ్డు పక్కనే చెత్తాచెదారం

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలో ఎక్కడ చూసినా రోడ్లపక్కనే చెత్తా చెదారం పేరుకుపోయి కనిపిస్తోంది. ఇళ్ల ముందుకు చెత్త సేకరణ వాహనాలు సక్రమంగా రాకపోవడంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే పడేస్తున్నారు. చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణ కేంద్రంలోని పలు కాలనీల నుంచి వెళ్లే అండర్‌గ్రౌండ్ డైనేజీ కాలువ ప్రధాన రోడ్డు పక్కనే ఓపెన్‌గా ఉంది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడంతో ఇంకా పాలకవర్గం కొలువుదీరలేదు. అధికారులే ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికే అంగడిబజార్, హౌసింగ్ బోర్డు, మల్కాపూర్ తదితర చోట్ల డ్రైనేజీ సమస్యలు గుర్తించి పరిష్కరించామన్నారు.

రోడ్లపై మురుగు.. రోడ్ల పక్కనే చెత్త

మొయినాబాద్: మున్సిపల్ కేంద్రంతోపాటు పలు కాలనీలు,గ్రామాల్లో రోడ్ల పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయింది. కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది.ఉన్న వాటిని సైతం సరిగా శుభ్రం చేయకపోవడంతో ఈగలు, దోమలు చేరుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని సహారా కాలనీ, స్టార్ కాలనీ, భరద్వాజ్ కాలనీ, ముస్తఫా కాలనీ, విజయనగర్ కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సరిగా లేకపోవడంతో మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి.చిలుకూరు, పెద్దమంగళారం,అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్,ఎనికేపల్లి,ముర్తూజగూడ,సురంగల్ గ్రామాల్లోనూ మురుగుకాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది.స్పెషల్ డ్రైవ్ పేరుతో చెత్తాచెదారం తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది.



విజయనగర్ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి

- అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూకు సంబంధించి 32, ఇతర శాఖలకు సంబంధించి 41, మొత్తం 73 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, సూపరింటిండెంట్లు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం అమలు చేయాలి

రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జగన్ డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2న నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి వాయిదా వేయడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ పెంచి అర్హులైన వారందరికీ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అలంపల్లి జంగయ్య, గజ్జెల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందించడంలో విఫలం

- పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్



సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీరు అందించడంలో, కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్ ఆరోపించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరుకు సాగునీరు-కాలుష్య పరిశ్రమలపై 5వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల సాధన పోరాటం తొలుత కల్వకుర్తి లిఫ్టు, షాద్‌నగర్ లిఫ్టులాగా మొదలైందని, 15 ఏళ్ల ఆందోళన తరువాత 2013లో జీవోలను సాధించుకోగలిగామని అన్నారు. తొలి తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు మార్చి తప్పు చేసిందని, 2015లో పనులను ప్రారంభించి మూడేళ్లలో పూర్తి చేస్తామని నమ్మించి ప్రతిపాదనలో లేని డిండిని తగిలించి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకోసం సాధించుకున్న పీఆర్ఎల్ఐ నీటిని ఏదుల నుంచి అక్రమంగా నల్లగొండకు తరలించుపోతున్నారని ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల ఆటగా మారిందని విమర్శించారు. హైదరాబాద్ నిర్వహించే సదస్సుకు విద్యావంతులు, విద్యార్థులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేదిక జిల్లా కో కన్వీనర్ నర్సింలు, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, పౌరహక్కుల సంఘం నాయకుడు తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరి

- డీఆర్ఓ సంగీత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పరిశ్రమల్లో నిబంధనల మేరకు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం పరిశ్రమలు, అగ్నిమాపక, పోలీసు శాఖలతో పాటు జిల్లాలోని పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలు, ఫైర్ సేఫ్టీ, మెడికల్ అండ్ హెల్త్ ఎంతో ముఖ్యమని అన్నారు. పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సమన్వయం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీ ఉందో లేదో తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీలు చేయడంతో పాటు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ చేపట్టాలని సూచించారు. ఇందులో స్థానికంగా ఉండే ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్ కంట్రోల్ తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి అధికారి యాదయ్య, జిల్లా అగ్నిమాప శాఖ అధికారి మురళీ మనోహర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐదు చెరువుల పునరుద్ధరణ

- సీఎస్సార్ నిధులతో చేపట్టేందుకు సిద్ధమైన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: తీవ్ర నిర్లక్ష్యానికి గురై మురికి కూపాలుగా మారిన చెరువుల పునరుద్ధరణకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఈమేరకు ఐదు చెరువుల పనులను సీఎస్సార్ కింద ప్రక్షాళన చేసి, అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మల్లెకుంట, బాచుకుంట, గోసాయికుంట, చాకలివాని చెరువు, మూసాకుంటలను సీఎస్సార్ నిధులతో ప్రక్షాళన చేసి, అభివృద్ధి పరిచేందుకు వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో, చందానగర్‌లోని మల్లెకుంటను శుభ్రపరచడం, కట్టను బలోపేతం చేయడం, పూడికతీసి, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయడం వంటి పనుల్ని చేయనున్నారు. ఔట్‌లెట్‌ను పునరుద్ధరించనున్నారు. మిగతా నాలుగు చెరువులకు సైతం కట్టల బలోపేతం, పూడికతీతలు, అవసరమైన చోట ఔట్‌లెట్‌ల మరమ్మతులు, చెరువుల పరిసరాల్లో సుందరీకరణల పనులు చేయనున్నారు. వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుడా ఉండేందుకు చెరువులను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- త్వరలోనే సీఎం చేతులమీదుగా కొహెడ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



అధికారులు, పాలకవర్గంతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో సోమవారం గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు సంబంధించిన కార్యక్రమాలతో పాటు త్వరలో చేపట్టబోయే కొహెడ మార్కెట్ నిర్మాణ ప్రాజెక్టు పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక వసతులతో కోహెడలో నిర్మించబోయే ఆసియాలో అతిపెద్ద మార్కెట్ నిర్మాణానికి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగనుందని పేర్కొన్నారు. కోహెడ మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఉపయోగకరంగా మారుతుందన్నారు. మార్కెట్‌కి వచ్చే ప్రతి రైతుకు న్యాయం చేసేలా పాలకవర్గం పనిచేయాలని సూచించారు. అధిక కమీషన్లు వసూలు చేసే మార్కెట్ వ్యాపారులను బ్లాక్ లిస్టులో పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు పాలకవర్గంతో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, డైరెక్టర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్ దాడులు

- అనుమతులు లేని ఆస్పత్రులపై కొరడా
- తనిఖీల్లో పట్టుబడ్డ నకిలీ వైద్యులు



తనిఖీలు నిర్వహించిన బృందం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ విభాగాల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. విద్యార్హతలు అసలే లేవు. అయినా వైద్యులుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కాంపౌండర్లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కొరడా ఝులిపించారు. సోమవారం షాబాద్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన వైద్యుల బృందం ఏడు క్లినిక్‌లపై కేసులు నమోదు చేసింది. ఓం సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్రావణ్ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్, మధు శ్రీ క్లినిక్, ముస్తాఫా క్లినిక్, మాస్టర్ క్లినిక్, శ్రీ సాయితిని, జంజం క్లినిక్‌లకు అనుమతులు లేవని గుర్తించింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా.మహేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మీడియాకు వివరాలు వెల్లడించారు. జంజం క్లినిక్‌లో వందల సంఖ్యలో డైక్లోఫెన్స్ సోడియం ఇంజక్షన్లు, కాల్షియం గ్లూకోనేట్ ఇంజక్షన్లు, స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్ ఇంజక్షన్లు గుర్తించినట్టు తెలిపారు. కనీస అర్హత లేకుండా అల్లోపతి దవాఖానా నిర్వహిస్తున్నారని అన్నారు. రోగంతో సంబంధం లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, మాత్రలను అధిక మోతాదులో ఇస్తున్నారని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ఎంబీబీఎస్ వైద్యులు మాత్రమే మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేయించుకుని ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుందన్నారు. అర్హత లేని వ్యక్తులు వైద్యం చేసినట్లైతే ఎన్ఎంసీ చట్టం 34, 35 ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు రూ.5 లక్షల జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిస్తామని వెల్లడించారు. మెడికల్ స్టోర్స్‌లో క్వాలిఫైడ్ వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా, ఫార్మసిస్టులు లేకుండా యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్, ఇతర షెడ్యూల్ డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. సంబంధిత రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్‌లపై డ్రగ్ కంట్రోల్ అథారిటీతో పాటు ఫార్మసీ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

యువకుడి అదృశ్యం



ఇమ్రాన్ ఖాన్(ఫైల్)

ఏడాది గడిచినా దొరకని ఆచూకీ

పహాడీషరీఫ్: తాగిన మైకంలో ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన ప్రకారం.. న్యూ బాబానగర్‌కు చెందిన షేక్ షా వలీ పెద్ద కుమారుడు మహ్మద్ ఇమ్రాన్ ఖాన్(28) స్క్రాప్ సేకరిస్తుంటాడు. గతేడాది నవంబర్ 24వ తేదీన తాగిన మైకంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఎంతకి రాకపోవడంతో డిసెంబర్ 1వ తేదీన ఇమ్రాన్ తల్లి జాహెదా నాజ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాటి నుంచి ఆచూకీ లభించడలేదు. ఇతని ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్డు దాటుతున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. హయత్‌నగర్‌లోని తొర్రూర్ క్రాస్ రోడ్డులో నివాసముండే దారమల్ల అశోక్ (27) ఆదివారం సాయంత్రం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జెఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి వచ్చాడు. రాత్రి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రామోజీ ఫిల్మ్‌సిటీ గేటు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో అశోక్ తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి బలవన్మరణం



పంకజ్(ఫైల్)

పహాడీషరీఫ్: ఉరేసుకుని ఓ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. యూపీ రాష్ట్రానికి చెందిన రాంబోలి కుమారుడు పంకజ్(25) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి బోరబండలో నివాసం ఉంటున్నాడు. తుక్కుగూడ సర్దార్‌నగర్‌లో మార్బుల్స్ బండల పాలిష్ చేసేందుకు గుత్తేదారు వద్దకు వచ్చాడు. ఉదయం 11 గంటల సమయంలో సమీపంలో ఓపెన్‌గా ఉన్న ప్రదేశంలోకి వెళ్లి వేప చెట్టుకు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అయ్యప్ప స్వామి సన్నిధానంలో విగ్రహాల చోరీ



దండుమైలారంలో అయ్యప్ప స్వామి సన్నిధానాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: అయ్యప్ప స్వామి సన్నిధానంలో పంచలోహ విగ్రహాలు చోరీకి గురైన ఘటన మండల పరిధిలోని దండుమైలారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చందర్ సింగ్ తెలిపిన ప్రకారం.. దండుమైలారం శివారులో ఉన్న అయ్యప్ప స్వామి సన్నిధానం డోర్ గడియను పగులగొట్టి లోనికి దూరిన గుర్తు తెలియని దుండగులు ఒక వెండి, ఐదు పంచలోహ విగ్రహాలు, గ్యాస్ సిలిండర్, వంట సామగ్రిని ఎత్తుకెళ్లారన్నారు. వాటి విలువ సుమారు రూ.1.20 లక్షల మేర ఉంటుందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘డబుల్’.. లబ్ధిదారులకు ట్రబుల్!

- ఇళ్ల ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు
- సీఐ సూచనమేరకు ఖాళీ చేసిన 40 మంది



లింగంపల్లి గేట్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

మంచాల: అనధికారికంగా డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వచ్చిన లబ్ధిదారులపై కేసులు నమోదు చేశామని మంచాల సీఐ మధు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని లింగంపల్లి గేట్ వద్ద గత ప్రభుత్వం 96 డబుల్ ఇళ్లను నిర్మించింది. వాటిలో మంచాల, నోముల, లింగంపల్లి గ్రామాలకు 30 చొప్పున లాటరీ పద్ధతిలో 90మంది లబ్ధిదారులను గుర్తించారు. మరో ఐదు ఇళ్లు గతంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన చెన్నారెడ్డిగూడ గ్రామస్తులకు కేటాయించగా.. మరొకటి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇచ్చిన రైతుకు కేటాయించారు.

మరో 20 మందిపై కేసు?

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేర్లు ప్రకటించినప్పటికీ అధికారికంగా ప్రొసీడింగ్‌లు ఇవ్వలేదు. ఇంతలో వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. నాటి నుంచి మూడు, నాలుగు దఫాలు తమకు ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇవ్వాలంటూ గత ప్రభుత్వం ప్రకటించిన లబ్ధిదారులు అధికారులను కోరారు. తహసీల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నెల 28న ఎమ్మెల్యే పర్యటనలో తమకు ఇళ్లు ఇవ్వాలంటూ ధర్నాకు దిగారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించిన తర్వాతే ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ఇదేమీ పట్టించుకోనివారు ఈ నెల 29న ఇళ్లలోకి వచ్చారు. అనధికారికంగా ఇళ్లలోకి రావొద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరించినా వారు పట్టించుకోలేదు. తాజాగా సోమవారం ఆర్‌అండ్‌బీ ఏఈ వినోద్ డబుల్ ఇళ్ల పనులు పూర్తవ్వకుండానే ఇళ్లలోకి వచ్చారని మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ మధు, ఏఎస్‌ఐ సతీశ్, పోలీసు సిబ్బంది డబుల్ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ సూచనలు పాటించకుంటే కేసు నమోదు చేస్తామని చెప్పడంతో 60 మందిలో 40 మంది అక్కడ నుంచి వెనుదిరిగారు. మరో 20 మందిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి మృతి

మీర్‌పేట: చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన భీశెట్టి బాల్జీకి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన మోహనకృష్ణ (18) బీటెక్ చదువుతున్నాడు. జూన్ 23వ తేదీన మోహనకృష్ణ ఆత్మహత్య చేసుకునేందుకు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మోహనకృష్ణ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని.. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

శంషాబాద్ రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటి పరిధిలోని ఊట్‌పల్లి శివారులో ఉన్న సదరన్ వెంచర్‌లో ఖాళీ స్థలంలో సోమవారం కొంతమంది పేకాట ఆడుతున్నా రు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 13 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.65,890 నగదు, 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేడు బాధ్యతల స్వీకరణ

లయన్స్ క్లబ్ 320ఏ జిల్లా గవర్నర్‌గా మహేంద్రకుమార్‌రెడ్డి



కందుకూరు: లయన్స్ క్లబ్ 320ఏ జిల్లా గవర్నర్‌గా మండల కేంద్రంలోని భూలక్ష్మీ ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. సామాజిక స్పృహ, సేవాతత్పరత కలిగిన ఆయన గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందిస్తూ, స్వచ్ఛంద సంస్థ అయిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌లో చేరారు. 2007-08 కందుకూరు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైయింది. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం జిల్లా గవర్నర్ స్థాయికి చేరుకున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి సంస్థ అభివృద్ధికి పెద్దన్న పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ జిల్లా గవర్నర్‌గా ఎంపిక చేసింది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని 90 క్లబ్‌లతో పాటు వికారాబాద్, పాత మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాలతో పాటు నైజాం ప్రాంతంలోని కల్యాణ కర్ణాటక, రాయచూరు, సేడం, గుల్బర్గా, యాదగిరి తదితర ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లోని 40 క్లబ్‌ల వరకు జిల్లా గవర్నర్ పరిధిలో కార్యక్రమాలు కొనసాగించాలి. ఆయా క్లబ్‌లలో దాదాపుగా 3,500 మందికి పైగా సభ్యులు ఆయన ఆధ్వర్యంలో పని చేయనున్నారు.

ఇది గురుతర బాధ్యత

ఈ సందర్భంగా డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా గవర్నర్‌గా పని చేయడం ఒక గురుతరమైన బాధ్యత అన్నారు. ఈ స్థాయికి రావడానికి నా సమయం చాలా వెచ్చించాల్సి వచ్చిందన్నారు. తన ముందున్న మార్గదర్శకుల అంచనాలను అందుకోవాలని, సేవలలో గ్లోబల్ లీడర్‌గా తన జిల్లాను నిలబెట్టాలనేదే ఆశయమన్నారు. తనకు సహకరించిన కందుకూరు, ఆమనగల్లు క్లబ్ సభ్యులతో పాటు జిల్లా పరిధిలోని సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

హెలెన్ కెల్లర్ సేవా వారోత్సవాలు

తన బాధ్యతల స్వీకరణ సందర్భంగా జూలై 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు హెలెన్ కెల్లర్ సేవా వారోత్సవాలు ప్రతి ఒక్క క్లబ్ నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఇందులో ప్రతి రోజు కంటి వైద్య శిబిరాలు, అవసరమైనవారికి ఆపరేషన్లు, రక్తదాన శిబిరాలు, డయాబెటిక్ నిర్ధారణ శిబిరాలు, ఉచితంగా స్టేషనరీ అందించడం, వైద్య శిబిరాలు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

నేతాజీ పొదుపు సంఘానికి ఉత్తమ అవార్డు



నేతాజీ పొదుపు సంఘానికి జ్ఞాపిక అందజేస్తున్న సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకరయ్య

వరుసగా నాలుగోసారి కైవసం చేసుకున్న మన్సాన్‌పల్లి సమాఖ్య సంఘం

మహేశ్వరం: సమాఖ్య పొదుపు సంఘంలో సభ్యులకు సక్రమంగా రుణాలు అందజేసి.. సకాలంలో వసూలు చేసినందుకు మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన నేతాజీ పొదుపు సంఘానికి ఉత్తమ అవార్డు వరించింది. సోమవారం శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకులలో నిర్వహించిన అభ్యుదయ సమాఖ్య 13వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. తమ సంఘంలో 700 మంది సభ్యులకు గాను రూ.2.70 కోట్లు జమయ్యాయని చెప్పారు. వరుసగా నాల్గోసారి అవార్డు రావడం ఆనందంగా ఉందని సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యుదయ సమాఖ్యా అధ్యక్షుడు నర్సింహ నేతాజీ పొదుపు సంఘం సభ్యులకు జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సమఖ్యా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, అభ్యుదయ సహాయ సహకార సంఘాల సమాఖ్యా పర్యవేక్షణ అధికారి బాల్‌రాజ్ గౌడ్, మన్సాన్‌పల్లి నేతాజీ పొదుపు సంఘం అధ్యక్షుడు దయానంద్ గౌడ్, ఉపాధ్యాక్షుడు శ్రీధర్ గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్‌చారి, సహాయ కార్యదర్శి కుమార్ యాదవ్, కోశాధికారి మల్లేశ్ ముదిరాజ్, పాలకవర్గ సభ్యులు పాండయ్య, శ్రీధర్ చారి, ఎండి.హాజీ, వెంకటేశ్ గౌడ్, రాజేశ్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, శేఖర్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.





18 లీటర్ల సారా పట్టివేత

ఆటో సీజ్, ఒకరి అరెస్టు



పట్టుబడిన సారా, నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, సిబ్బంది

ఆమనగల్లు: పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 18 లీటర్ల నాటుసార సీజ్ చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపిన ప్రకారం.. వెల్దండ మండలం పోచమ్మగడ్డ తండా నుంచి మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి నాటుసారా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సీఐ బద్యానాద్ చౌహాన్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. పోచమ్మగడ్డ తండా నుంచి కలకొండకు ప్రయాణిస్తున్న ఆటోను తనిఖీ చేయగా అందులో తొమ్మిది ప్లాస్టిక్ బాటిల్స్‌లో 18 లీటర్ల సారా పట్టుబడింది. సారా, ఆటోను సీజ్ చేసి సారా తరలిస్తున్న పాండును అరెస్టు చేశారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, దశరథ్, శ్రీను, బాబు, ఆమని, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితులకు రిమాండ్
- పది కిలోల గంజాయి స్వాధీనం



మోకిల పోలీసుల అదుపులో నిందితులు

శంకర్‌పల్లి: గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శంకర్‌గౌడ(27), శ్రీధర్ పరిడా(19), మిని నాహక్(34) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా వీరు తమ రాష్ట్రం నుంచి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తీసుకువచ్చి లేబర్ ఏరియాల్లో విక్రయిస్తున్నారు. మిని నాహక్ అనే మహిళ తీసుకువచ్చిన గంజాయిని సోమవారం ముగ్గురు కలిసి శంకర్‌పల్లి మండలం ఇంద్రారెడ్డినగర్ మీదుగా హైదరాబాద్ వైపు తరలిస్తుండగా రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, మోకిల పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 10 కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకులకు బెయిల్

- రూ.20 వేలతో రెండు పూచీకత్తులు అందజేయాలి
- నాంపల్లి 17వ అడిషినల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశం

సిటీ కోర్టులు : మహా న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి కేసులో బీఆర్‌ఎస్ నాయకులకు సోమవారం నాంపల్లిలోని 17వ అడిషినల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కక్కరూ రూ. 20వేలతో రెండు పూచీకత్తులు అందజేయాలని షరతులు విధించింది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సదరు న్యూస్ ఛానెల్‌లో తప్పుడు వార్తలు ప్రచురించారని, అసత్యపు ఆరోపణలతో కేటీఆర్ పరువుకు భంగం కలిగేలా మహా న్యూస్ యాజమాన్యం వ్యవహరించిందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం మహా న్యూస్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కార్యాలయం అద్దాలు, కార్యాలయం ముందున్న కార్ల అద్దాలను ధ్వంసం చేశారని పోలీసులు వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారి తరుపున బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు సోమవారం నాంపల్లి కోర్టులో వాదనలు వినిపించారు. దీంతో వారికి రూ.20 వేలతో రెండు పూచీకత్తులు, వ్యక్తిగత బాండ్‌లను కోర్టులో అందజేయాలని సూచించించిన నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



డీలర్లతో సమావేశమైన ఏఓ సురేశ్ రెడ్డి

కొందుర్గు: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి సురేశ్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ‘సాక్షి’దినపత్రికలో ‘కొరత చూపి..రైతులను దోచేసి..’అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించి కొందుర్గు రైతువేదికలో ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు డీలర్లు మాట్లాడుతూ.. తమకు హోల్‌సేల్ డీలర్లు ఎమ్మార్పీ ధరలకన్నా అధికంగా ఎరువులను విక్రయిస్తున్నారని, దీనికితోడు రవాణా, హమాలి ఖర్చులు అధికమవుతున్నాయని వాపోయారు. ఎరువులు అమ్మడం వల్ల నష్టాల పాలవుతున్నామని వాపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీలర్లు మల్లారెడ్డి, శంకర్ రెడ్డి, యాదయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ భూ రిజిస్ట్రేషన్ రద్దు

వివరాలు వెల్లడించిన ఆర్డీఓ సరిత

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో చోటు చేసుకున్న రూ.7 కోట్ల అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై ప్రభుత్వం, అధికారులు స్పందించారు. భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్లు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఆర్డీఓ సరిత వివరించారు. పట్టాదారుకు తెలియకుండా జరిగిన భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై తహసీల్దారు పార్థసారథి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోని వివరాలను సేకరించారు. అక్రమ భూ రిజిస్ట్రేషన్‌పై స్పదించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ సరిత ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తయారు చేసిన నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. రెవెన్యూ అధికారుల నివేదికను పరిశీలించిన కలెక్టర్ నారాయణ రెడ్డి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేశారని ఆర్డీఓ సరిత వివరించారు. చిల్కమర్రి భూ వ్యవహారంలో అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతో పట్టాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.